క్లుప్తంగా

గంగాలమ్మతల్లి గుడికి విరాళం



గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక : మండలంలోని మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం బొడ్డేడ నాగరాజు–సుబ్బలక్ష్మి దంపతులు రూ.5016 నగదును ఆలయ నిర్వాహకులకు విరాళంగా అందజేశారు. సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు,ఈశ్వర అప్పారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రమాదబీమాతో ఆర్థిక భరోసా



ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక(అచ్యుతాపురం):ప్రమాదబీమాతో ఆర్థిక భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అచ్యుతాపురం మండలం మడుతూరు గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త గాలి గణేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో విజయకుమార్ చేతుల మీదుగా ప్రమాద బీమా కింద రూ.50వేల చెక్కును ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి మోటూరు శ్రీవేణి, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బైలపూడి శ్రీరామదాసు తదితరులు పాల్గొన్నారు.

సెలవు దినాల్లో కార్యక్రమాలు వద్దు

నర్సీపట్నం: సెలవు దినాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని పీఆర్టీయూ నర్సీపట్నం మండలాధ్యక్షులు, కార్యదర్శులు అడిగర్ల వరహాలనాయుడు, జి.వి.రమేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 22 నుంచి కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన శక్తి సప్తాహ్ కార్యక్రమం నిర్వహించకూడదన్నారు. ఉపాధ్యాయల పనిభారం, విద్యార్థుల మానసిక స్థితిని దృష్టిలో పెట్టుకుని ఈ సోమవారం జరిగేలా రీషెడ్యూల్ ఇవ్వాలని కోరారు.

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

నర్సీపట్నం: వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆదివారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నిక పరిశీలకులుగా విశ్రాంత ఎంఈవో జె.ఎస్.ఎస్. నాగేశ్వరరావు, పెన్షర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వి.గజ్జలమ్మ వ్యవహరించారు. అధ్యక్షుడిగా బేరా చినబాబు అలియాస్ బాబ్జి, కార్యదర్శిగా కామిరెడ్డి సత్యనారాయణ, కోశాధికారిగా అల్లు అప్పారావు, ఉపాధ్యక్షులుగా కుప్పిలి స్వామి, ఎం.వి. రంగారావు, సంయుక్త కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా వాకాడ శంకర్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా బాబి, గౌరవ మహిళా సభ్యులుగా జయంతి వేదవల్లి, పాలిమార్ రాజశ్రీ, గౌరవ సలహాదారులుగా చుక్కల రాము, ఉడా వెంకట్రావు, జె.ఎస్.ఎస్. నాగేశ్వరరావు, డి.నూకరాజు ఎంపికయ్యారు. క్లబ్ ఏర్పాటై పదేళ్లయిన సందర్భంగా దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించడానికి కృషి చేస్తామని నూతన కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు.

క్యాన్సర్ పట్ల అవగాహన తప్పనిసరి



వైద్య శిబిరం ఫ్లెక్సీతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

తుమ్మపాల: క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభద్ర సూచించారు. స్థానిక రోటరీ తాటికొండ నూకయ్య శెట్టి మెమోరియల్ హాల్లో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి(విశాఖ) ఆధ్వర్యంలో ఉచిత రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. పట్టణ, పరిసర గ్రామాల నుంచి వచ్చిన 80 మంది స్త్రీ, పురుషులకు వైద్యులు డాక్టర్ సుధానంద, డాక్టర్ సుకన్య పరీక్షలు జరిపి, అవసరమైన మందులు పంపిణీ చేశారు.



చూచుకొండలో బాబా వేషధారణలో భక్తులు



తోటాడ ఓంకార పీఠంలోని గురు పౌర్ణమి వేడుకల్లో భక్తులు



తోటాడలో అన్న సమారాధనకు హాజరైన భక్తులు

భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ

మూలజంపలో పాండవుల కొండ చుట్టూ భక్తుల గిరిప్రదక్షిణ



సంకీర్తనలు ఆలపిస్తున్న చిన్నారులు



మూలజంపలో గురుపౌర్ణమి సందర్భంగా పాండవుల కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రాంబిల్లి(యలమంచిలి): మండలంలో మూలజంప గ్రామంలో ఆషాఢ గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం గ్రామంలో పెద్దల కాలం నుంచి ఆనవాయితీగా ఎంతో ఘనచరిత్ర కలిగిన పాండవుల కొండ చుట్టూ గురుపౌర్ణమి రోజున గిరిప్రదక్షిణను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇక్కడ గ్రామంలో చాలా కాలంగా గురుపౌర్ణమి రోజున ప్రాచుర్యం పొందిన పాండవుల కొండ వద్ద గిరి ప్రదక్షిణను గ్రామంలో ప్రజలు చేస్తుంటారు. ముందుగా గ్రామంలో వినాయకునికి, దుర్గాలమ్మ వారి ఆలయాలు వద్ద గ్రామ ప్రజలు అందరూ కొబ్బరికాయ, పండ్లు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గిరిప్రదక్షిణ నియమ నిష్టలతో చేశారు. కొండచుట్టూ చిడతలు, భజనలు, కోలాటాలు చేస్తూ భక్తి గీతాలు ఆలపిస్తూ గిరి ప్రదక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వేగిరాము, అందుకూరి ప్రసాద్, వేగి శ్రీను, వేగి రమణబాబు, వేగిభాస్కర రావు, పారునాయుడు, లోవరాజు పాల్గొన్నారు.

సాయి మందిరాల్లో ప్రత్యేక పూజలు

మండలంలో పెదకలవలాపల్లి, ధారపాలెం, దిమిలి, అప్పన్నపాలెం, లాలం కోడూరు గ్రామాల్లో షిర్డీ సాయిబాబా మందిరాల్లో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పంచామృతాభిషేకాలు, పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. కోట్నబోలు గ్రామంలో సాయిబాబా ఆలయం వద్ద ఏకాహం భజన కార్యక్రమం జరిపారు. సాయంత్రం సాయిబాబా ఆలయాల వద్ద పవిత్ర సాయి హారతి కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మునగపాక : గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా మునగపాక షిరిడీసాయి బాబా ఆలయంలో నిర్వహించిన ఏకాహం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా అన్న సమారాధన జరిపారు. తోటాడలోని ఆదినారాయణ స్వామి రాజయోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓంకార పీఠంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా జరిపారు. మేనేజింగ్ ట్రస్టీ సుసుమ్న నేతృత్వంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు ఆలపించిన కీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

యలమంచిలి రూరల్ : గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయి నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. యలమంచిలి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తులు బాబాకు పాలాభిషేకం, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా అన్న సమారాధన జరిపారు. ఎన్టీఆర్ కాలనీ,రాంనగర్, పెదపల్లి,కొక్కిరాపల్లి,రేగుపాలెం , ఏటికొప్పాక, పులపర్తి గ్రామాల్లో బాబా ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. వేద వాఙ్మయాన్ని మానవాళికి అందించిన వ్యాస మహర్షిని స్మరించుకుంటూ తమ గురువులకు పలువురు గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు పొందారు. పలుచోట్ల సాయంత్రం ఆలయాల వద్ద చేసిన దీపాలంకరణ ఆకట్టుకుంది.



యలమంచిలి బస్టాండు వద్ద బాబా ఆలయంలో భక్తుల పూజలు



యలమంచిలి : బస్టాండ్ వద్ద భక్తులకు అన్న సమారాధన

అచ్యుతాపురం (మునగపాక): అచ్యుతాపురం మండలంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తి శ్రద్ధలతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా ఉప్పవరంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేద వ్యాసుని పూజ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ గురువులను పూజించాలని ఫౌండేషన్ ప్రతినిధి బీవీ రమణ కోరారు.ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు,చిన్ని రామనాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నక్కపల్లి : గురుపౌర్ణమి సందర్భంగా నక్కపల్లి, చినదొడ్డిగల్లు, వేంపాడు, తదితర గ్రామాల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో బాబాకు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. నామవరంలో ఉన్న సాయిబాబా ఆలయం, దత్తాత్రేయ ఆలయాల్లో కూడా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాలనుంచి భక్తులు ఆలయాలకు వెళ్లి బాబాను దర్శించుకున్నారు. పూర్వ విద్యార్థులు తమకు విద్యనేర్పిన గురువుల వద్దకు వెళ్లి ఆశీస్సులు తీసుకున్నారు.



ఉప్పవరంలో గురుపౌర్ణమి వేడుకలు



చినదొడ్డిగల్లు ఆలయంలో సాయిబాబాకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వాస్పత్రికి వాటర్ డిస్పెన్సర్ అందజేత



ప్రభుత్వాస్పత్రికి వాటర్ డిస్పెన్సర్ అందజేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా యలమంచిలి బ్రాంచి అధికారులు

యలమంచిలి రూరల్ : బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బ్రాంచి అధికారులు ఆదివారం యలమంచిలి సామాజిక ఆస్పత్రికి వాటర్ డిస్పెన్సర్ అందజేశారు. ప్రతి ఏటా బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది సురక్షితమైన తాగునీరు తీసుకోవడానికి వీలుగా వాటర్ డిస్పెన్సర్ అందజేసినట్టు బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. సామాజిక ఆస్పత్రి వైద్యులు,సిబ్బంది బ్యాంక్ ఆఫ్ బరోడా యలమంచిలి బ్రాంచి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మొక్కల శ్రీనివాస్, వైద్యురాలు స్ఫూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సెజ్ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే విజయకుమార్



అచ్యుతాపురం కూడలిలో విద్యుత్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం (మునగపాక): యలమంచిలి నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా సేవలందిస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఏపీఐఐసీ నిధులతో అచ్యుతాపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లను ఆయన ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెజ్ అభివృద్ధికి అవసరమయ్యే నిధులు మంజూరు చేయడంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాద్, తహసీల్దార్ సరోజిని, ఎంపీడీవో సురేష్‌కుమార్, పార్టీ నాయకులు బైలపూడి రామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాబ్జీ, డీఎస్ఎన్ రాజు, చిన్నారావు, సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా యానాద్రి అమ్మవారి పండగ



యానాద్రి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



పుట్టరూపంలో పూజలందుకుంటున్న అమ్మవారు

యలమంచిలి రూరల్: యానాద్రి అమ్మవారి పండుగ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అల్లూరి సీతారామరాజు కాలనీలో యానాద్రి అమ్మవారిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. ఇక్కడ పుట్టరూపంలో కొలువుదీరిన అమ్మవారికి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. చీర, రవిక, గాజులు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ ఉచిత ప్రసాద వితరణ చేసింది. పండగ సందర్భంగా కోలాటాలు, నేలవేషాలతో సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. పండగ సందర్భంగా అల్లూరి సీతారామరాజు కాలనీ ప్రధాన రహదారిని విద్యుద్దీపాలతో అలంకరించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

లండన్ ఐవీఎఫ్ సెంటర్ ప్రారంభం

పాయకరావుపేట : రాష్ట్రంలో అతి తక్కువ ఖర్చుతో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న నంబర్ 1 సాఫల్య కేంద్రంగా లండన్ ఐవీఎఫ్ సెంటర్ నిలుస్తుందని సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సూర్యమహల్ ఎదుట లండన్ ఐవీఎఫ్ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఆదివారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.చంద్రారెడ్డి మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా రాష్ట్రంలోని ప్రజలకు అత్యంత ఆధునిక విధానాల ద్వారా అంతర్జాతీయ స్థాయి చికిత్సను అందుబాటైన ధరల్లో అందిస్తున్నామన్నారు. తమ కేంద్రాన్ని ఇక్కడ ప్రారంభించడం వల్ల ఇక పై స్థానికంగా సంతాన లేమితో బాధపడుతున్న దంపతులకు అత్యాధునిక వసతులు కలిగిన లండన్ ఐవీఎఫ్ సెంటర్ ద్వారా అద్భుతమైన చికిత్సలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా రూ.50,000లకే చికిత్స అందిస్తామన్నారు. డాక్టర్ ఎస్.అనన్య మాట్లాడుతూ సంతానం లేని వారు ఇకపై చికిత్సల కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పనిలేకుండా తమ లండన్ ఐవీఎఫ్ సెంటర్‌లోనే అత్యాధునిక చికిత్సలు పొంది మాతృత్వ భాగ్యం పొందవచ్చన్నారు. ఇక్కడ ఐయుఐ, ఐవీఎఫ్ ఐసీఎస్ఐ, స్పెరం , ఎంబ్రియో ఫ్రీజింగ్, లాపరోస్కోపి, హిస్టరోస్కోపి, గైనాకాలజీ మొదలైన సంపూర్ణమైన చికిత్స విధానాలు అందిస్తున్నామని డాక్టర్ మాధవీ లత వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కోనే ఆదినారాయణ, నామాపళని విజయబాబు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఐవీఎఫ్ డైరెక్టర్లు

యోగా సాధనతో ఆరోగ్యకర జీవితం



గురువులను సత్కరిస్తున్న జార్జిక్లబ్ ప్రతినిధులు

తుమ్మపాల: యోగాతో పరిపూర్ణ జీవనం సాధ్యమని, ఆరోగ్యకర జీవితానికి గురువులు నేర్పే విద్యే సరైన మార్గమని భారత్ స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు భీశెట్టి దొరమ్మ నాయుడు, కార్యదర్శి మంగయ్య అన్నారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని జార్జ్ క్లబ్‌లో భారత్ స్వాభిమాన ట్రస్ట్ పతంజలి యోగా వారి ఆధ్వర్యంలో జార్జిక్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగి నాయుడు, సభ్యులు కోలపర్తి కన్నబాబు, బి.శ్రీనివాసరావులు గురువులను సత్కరించి, వారు తమ జీవితాల్ని ఎలా మార్చారో వివరించారు. తమకంటే ఉన్నతంగా స్థిరపడాలనే తపనతో గురువులు నిరంతరం శ్రమిస్తారని కొనియాడారు. యోగా గురువులు మాట్లాడుతూ ప్రకృతి ద్వారా వచ్చే ఫలహారాలను భుజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, ప్రకృతితో మమేకమవ్వాలన్నారు. శ్వాస పై ధ్యాస ఉంచుతూ, ఓంకార నామాన్ని జపిస్తూ, పతంజలి విరచిత యోగాసనాల ద్వారా ఆరోగ్యకరంగా జీవించాలని సూచించారు. ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటూ ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదుగుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఆచరిస్తూ ప్రపంచానికి సనాతన ధర్మాలను పరిచయం చేయడమే యోగా ధ్యేయమన్నారు.

వదలని వాన

- అడపా దడపా కురుస్తున్న వర్షం
- లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపునీటితో ఇబ్బందులు



రహదారిలో నిలిచిపోయిన వర్షపు నీరు



సోమలింగపాలెంలో విత్తనాలు వేసిన వరినారు మడిలో నిలిచిన నీరు

కోటవురట్ల: వరుణుడు వదిలిపెట్టలేదు. వారం రోజులుగా ఎడాపెడా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభిస్తోంది. లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. మొన్నటి వరకు ఎండిపోయిన పంట కాలువలకు జీవం వచ్చింది. వరాహకు జలకళ వచ్చింది. ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. రెండు రోజులుగా ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్టు వర్షం కురవడంతో పలు పంటలు నీటమునిగాయి. ప్రధానంగా పూత దశకు వచ్చిన నువ్వు పంట పలు ప్రాంతాలలో ముంపునకు గురయ్యింది. ఇదు వర్షం మరో రెండు రోజులు ఉంటే నష్టం తప్పదని నువ్వు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క ఖరీఫ్ వరి నాట్లకు రైతులు సన్నద్ధమవుతున్నారు. నారు ఎదిగిన ప్రాంతాలలో రైతులు దమ్ము పట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బలహీనపడిన అల్పపీడనం

మునగపాక : అల్పపీడనం బలహీనపడడంతో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. గత నాలుగు రోజులుగా మండల వ్యాప్తంగా వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. అలాగే వరి నారుమడుల్లో నీరు పెరిగిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా ఈ వర్షాలకు సంబంధించి మునగపాక బీసీ కాలనీలో పలు వీధుల్లో వర్షపునీరు నిలిచిపోయింది. రహదారులు లోతట్టుగా ఉండడం అలాగే డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో నిలిచిన నీటి కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.అలాగే మునగపాక మండల సముదాయానికి వెళ్లే దారిలో వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మునగపాక బీసీ కాలనీలో వీధిలో నిలిచిన వర్షపునీరు

యలమంచిలి రూరల్ : వాయుగుండం ప్రభావంతో యలమంచిలి ప్రాంతంలో మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి యలమంచిలి పట్టణంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. ఏటికొప్పాక వద్ద వరాహ, సోమలింగపాలెం వద్ద శారదానదుల్లో నీటి ప్రవాహ ఉధృతి పెరిగింది. ముంపు భయంతో గోకివాడ ఆనకట్ట రెండు గేట్లు ఎత్తడానికి సోమలింగపాలెం రైతులు ఆనకట్ట వద్దకు వెళ్లగా ఒక గేటే తెరుచుకుంది. రెండో గేటు మరమ్మతుకు గురై మొరాయించింది. ఆనకట్ట వద్ద నీటి ప్రవాహాన్ని పర్యవేక్షించాల్సిన సిబ్బంది పత్తా లేకుండా పోయారని గ్రామస్తులు ఆరోపించారు. వర్షాలు తెరిపివ్వకుండా కొనసాగుతున్న తరుణంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిన యలమంచిలి జలవనరుల శాఖ అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు స్థానికుల నుంచి వస్తున్నాయి. వాన కొనసాగుతుండడంతో చెరువులు, గెడ్డలు, వాగులు, జలాశయాల్లో జలకళ కనిపించింది.

నీటి ముంపులో వరినారు మడులు

విడవకుండా కురుస్తున్న వర్షంతో యలమంచిలి మండలంలోని గ్రామాలు పట్టణానికి సమీపంలో ఉన్న పంటపొలాల్లో వరినారు మడులు నీటి ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా పల్లపు ప్రాంతాల్లో ఉన్న పొలాల్లో విత్తనాలు వేసిన మడుల్లో నీరు నిలిచిపోయింది. అరటి, చెరకు తోటల్లో కూడా నీరు నిలిచిపోయింది. మరో రెండ్రోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా నీటి ముంపునకు గురైన వరినారు మళ్లను కాపాడుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. విత్తనం చల్లిన రెండు మూడు రోజుల వ్యవధిలో ఉన్న నారుమళ్లలో భారీగా నీరు చేరితే తొందరగా తొలగించాలని చెబుతున్నారు.



నీట మునిగిన నువ్వు చేను



గోకివాడ ఆనకట్ట గేటు ఎత్తుతున్న సోమలింగపాలెం రైతులు



సోమలింగపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శారదానది



బురదమయంగా మారిన అల్లూరికాలనీ రోడ్డు

వీఆర్ఆర్ పేట వద్ద దెబ్బతిన్న కాజ్‌వే

కె.జె.పురం మీదుగా బస్సు సర్వీసుల మళ్లింపు



కె.జె.పురం మీదుగా నడుస్తున్న ఆర్టీసీ బస్సు

మాడుగుల రూరల్: ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విజయరామరాజు పేట వద్ద బొడ్డేరు నదిపై నిర్మించిన డ్రైవర్సన్ రోడ్డు(కాజ్‌వే) పూర్తిగా దెబ్బతింది. దాంతో బస్సులు, ఇతర పెద్ద వాహనాలు కె.జె.పురం మీదుగా మళ్లించారు. విశాఖ, అనకాపల్లి నుంచి పాడేరు, మాడుగుల వచ్చిపోయే మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు పూర్తిగా ఘాట్‌రోడ్డు, కోటపాడు, కె.జె.పురం మీదుగా చోడవరం బస్సు సర్వీసులు అప్పలరాజుపురం, సింగవరం, జైతవరం, ఉప్పరగూడెం, కొత్తపల్లి, వరహాపురం మీదుగా నడుపుతున్నారు. దీంతో కె.జె.పురంలో నిత్యం ట్రాఫిక్ ఏర్పడుతోంది.